ong-10_ong-10.qxd 3/23/2026 11:37 PM Page 1






# ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లకు ఘన స్వాగతం.!









**(నక్కపల్లి రూరల్/ అడ్డురోడ్డు, ప్రభాతవార్త)**

నక్కపల్లి మండలం రాజయ్యపేట సమీపంలో లక్ష 30 కోట్ల రూపాయలతో అత్యంత ప్రతిష్టాత్మక నిర్మిస్తున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం మధ్యాహ్నం చందనాడ రాజయ్యపేట గ్రామాల వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ పవన్ కళ్యాణ్ లకు లక్ష్మి మిట్టల్ ఆదిత్య మిట్టల్ తో పాటు హోంమంత్రి వంగలపూడి అనిత లు ఘన స్వాగతం పలికారు. వారితోపాటు కేంద్రమంత్రి కుమారస్వామి , కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ , స్పీకర్ అయ్యన్నపాత్రుడు , మంత్రులు నారా లోకేష్ , కొండపల్లి శ్రీనివాస్ , భరత్ , అచ్చెన్నాయుడు , గుమ్మిడి సంధ్యారాణి, కొల్లు రవీంద్ర , ఎంపీ రమేష్ , బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ , ఎమ్మెల్యేలు, నేతలు లకు స్వాగతం పలికిన అనంతరం ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ ఇండియా ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమం వద్ద ఏర్పాటు చేసిన ఎక్స్ పీరియన్స్ సెంటర్‌ను తిలకించిన ముఖ్యమంత్రి చంద్రబాబు తోపాటు కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మ, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నారా లోకేష్, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇండియా ప్లాంట్ కు సంబంధించిన వివరాలు, ఉక్కు రంగంలో తిలీవిళీ ఇండియా సంస్థ ప్రగతి వంటి అంశాలపై వీడియో ప్రజెంటేషన్‌ను తిలకించిన సీఎం చంద్రబాబు కు లక్ష్మీ మిట్టల్ ఆదిత్య మిట్టల్ సీఈవో లు కలిసి పూర్తిస్థాయి వివరాలను తెలియజేశారు. సమయంలో ఆసక్తికరమైన విషయాలు చోటుచేసుకున్నాయి లక్ష్మీ మిట్టల్ ,ఆదిత్య మిట్టల్ లకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో పాటు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత కోసం మాట్లాడారు. ఆ సమయంలో వారు సంతోషించారు.

## డ్రైవర్ శ్రీనుపై అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలి: ఆర్టీసీ డ్రైవర్లు నిరసన

**అనకాపల్లి మార్చి 23 : (ప్రభాతవార్త)**



అనకాపల్లి డిపోలో కె శ్రీను డ్రైవర్ యాక్సిడెంట్ పై విచారణ ఏకపక్షంగా ఉందని అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం అనకాపల్లి ఆర్టీసీ డిపో ఆవరణలో కార్మికులందరూ ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఎన్.ఎం యు ఎ కార్యదర్శి కే ఎన్ వి రమేష్ మాట్లాడుతూ జరిగిన యాక్సిడెంట్ లో పాదచారిని తప్పు 80 శాతం ఉన్నప్పటికీ యాక్సిడెంట్లో కేవలం డ్రైవర్ ను పూర్తి బాధ్యుడని చేయటం చాలా అన్యాయం అన్నారు. తక్షణమే డ్రైవర్ యొక్క అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం డిపో క్యాషియర్ ఎం బి రాజు , డిపో కమిటీ, కార్మికులు పాల్గొని నిరసన తెలియజేశారు.

## నూకాంబికను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు దంపతులు

**అనకాపల్లి మార్చి 23 ;(ప్రభాతవార్త)**



ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం అనకాపల్లి శ్రీ నూకాంబిక అమ్మవారిని తుని మాజీ శాసనసభ్యులు రాజా అశోక్ బాబు, ఆంధ్ర ప్రదేశ్ మార్క్ ఫెడ్ మాజీ ఛైర్మన్, ఉమ్మడి విశాఖ జిల్లా డీ సీ ఎం ఎస్ మాజీ ఛైర్మన్ డీ వీ వీ గోపాల్ రాజు (పెదబాబు) తదితరులు దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఛైర్మన్ పీలా నాగ శ్రీను పూర్ణకుంభం తో స్వాగతం పలికి, అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి చిత్రపటం అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం నవరాత్రి ఉత్సవాలను మార్క్ఫెడ్ మాజీ ఛైర్మన్ డివివి గోపాల్ రాజు, మెహర్ బేబీ దంపతులు ప్రారంభించారు.

## గ్రంథాలయంలో భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమం

**నర్సీపట్నం,మార్చి 23,ప్రభాతవార్త**




భగత్ సింగ్ వర్ధంతిని నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ధికారిణి పీ.దమయంతి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠకులు రామచంద్రరావు, సీతారామమూర్తి భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పాఠశాల విద్యార్థి ఈశ్వర్ మాట్లాడుతు భగత్ సింగ్ ఎక్కడ పుట్టింది, ఏవిధంగా స్వతంత్రోద్యమంలో పాల్గొన్నారో వివరించాడు. పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థి ఆర్.సత్తిబాబు మాట్లాడుతూ 1919లో జరిగిన జలియన్వాలాబాగ్ ఘటన భగత్ లో బ్రిటిష్ వారి పట్ల మరింత కోపాన్ని పెంచింది. ఆనాటి నుండి తన జీవితాన్ని స్వాతంత్రోద్యమానికే అంకితం చేయాలని నిర్ణయించుకున్నారన్నారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పీ. ప్రభాకర్ మాట్లాడుతూ భారత స్వాతంత్రోద్యమంలో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవకారులలో భగత్ సింగ్ ఒకరు. బ్రిటిష్ పాలనను వ్యతిరేకించినవాడు. ప్రత్యక్షంగా స్వాతంత్రములో పాల్గొన్నారు. భగత్ సింగ్ కు వివాహం చేయాలని తలంచినప్పుడు నా జీవితం దేశానికే అంకితం చేయాలని ఇంటి నుండి వెళ్లి స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నారని, తనకు ఉరిశిక్ష వేసినంత వరకు పుస్తక పఠనం చేసిన వ్యక్తి భగత్ సింగ్ అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు, పాఠకులు,యువకులు పాల్గొన్నారు.

## స్మార్ట్ కిచెన్స్ నిర్ణయాన్ని విరమించుకోవాలి

**- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు**

**నర్సీపట్నం,మార్చి 23,ప్రభాతవార్త**




మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేయబోయే స్మార్ట్ కిచెన్స్ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే విరమించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన ఉద్యమం చేపట్టడం జరుగుతుందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన నిరసన కార్యక్రమంలో చేపట్టారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ సుమారు పాతికెళ్లుగా మధ్యాహ్నం భోజనం పథకంలో వేలాదిమంది మహిళలు పనిచేస్తున్నారని, వీరు అనేక ఏళ్ల పాటు పారితోషకాలు ఇవ్వకపోయినా పగే ముందస్తు పెట్టుబడి పెట్టి పిల్లలకు న్యాయమైన ఆహారాన్ని వండి పెడుతున్నారన్నారు. డొక్కా సీతమ్మ వంటి వారి పేరు పెట్టి నేడు మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రైవేటుపరం చేయాలని చూడటం ప్రభుత్వానికి ఎంతవరకు సమంజసమన్నారు. పేద పిల్లలకు పెట్టే ఆహారంపై, పథకాలపై ప్రభుత్వం నిర్లక్ష్యధోరణి విడనాడాలన్నారు. కావున కార్మికులందరూ మిడ్ డే మిల్ పథకం స్మార్ట్ కిచెన్లకు ఇవ్వడాన్ని ఐక్యంగా ఎదుర్కోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మిడ్ డే మిల్ కార్మిక సంఘం నాయకులు కె . ప్రసన్న, సత్యవతి, చిన్న తల్లి, ఒమ్మి నూకరాజు, సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, ఈరెల్లి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్ కు స్వాగతం పలికిన మాజీ మంత్రి దాడి

**అనకాపల్లి రూరల్ మార్చి 23: (ప్రభాతవార్త)**



విశాఖ చేరుకున్న విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ కి సోమవారం విశాఖ ఎయిర్ పోర్టులో మాజీ మంత్రి దాడి వీరభద్రరావు , టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి దాడి రత్నాకర్ తో కలసి ఘనస్వాగతం పలికారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద దేశంలోనే అతిపెద్ద ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్స్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , కేంద్ర ఉక్కుమంత్రి కుమారస్వామి తో కలిసి నారా లోకేష్ పాల్గొంటారు.

## 2030 నాటికి టీబీ నివారణ లక్ష్యం ఎమ్మెల్యే కెఎస్ఎన్ రాజు

**చోడవరం, మార్చి 23, ప్రభాతవార్త:**




రానున్న 2030 నాటికి దేశవ్యాప్తంగా క్షయ వ్యాధి నిర్మూలన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం తగు కృషి చేస్తామని ఆ దిశగా ప్రతి ఏడాది మార్చి 23న క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే కే ఎస్ ఎన్ ఎస్ రాజు చెప్పారు. సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవ సందర్భంగా చోడవరం ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఆసుపత్రి కమిటీ ఛైర్మన్ దేవరపల్లి వెంకట అప్పారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ లక్షణాలు ఎవరికైనా కనిపిస్తే వెంటనే ఆసుపత్రి వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి నుంచి కొత్తూరు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా టీబీ వ్యతిరేక నినాదాలు చేస్తూ సమాజంలో ప్రతి ఒక్కరు గౌరవంగా జీవించేందుకు సంపూర్ణ ఆరోగ్యం ఎంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉషోదయ కళాశాల విద్యార్థులు ఆసుపత్రి వైద్యులు సిబ్బంది, టీవీ యూనిట్, ఐ సి టి సి సిబ్బంది పాల్గొన్నారు.

## భగత్ సింగ్ స్ఫూర్తితో డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

**- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ**

**చోడవరం, మార్చి 23, ప్రభాతవార్త:**



స్వాతంత్ర సమరయోధులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 95వ వర్ధంతి సందర్భంగా సోమవారం చోడవరం లో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, నాయకులు సిఐటియు ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. ఉషోదయ కాలేజీ నుండి కొత్తూరు వరకు సాగింది. అనంతరం మానవహారం నిర్వహించి, విద్యార్థులు, ప్రజలు నాయకులు డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞను చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన భగత్ సింగ్, రాజ్ గురు ,సుఖదేవుల ప్రాణ త్యాగాలు తో స్వాతంత్రం సిద్ధించుకోవడం జరిగిందని వారి స్ఫూర్తితో దేశంలో పెరిగిపోతున్న డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాల మాఫియాలను అరికట్టడం కోసం విద్యార్థులు, యువత నడుం బిగించాలని పిలుపునిచ్చారు. నేడు డ్రగ్స్ మాఫియాలు పేచ్చి మీరు పోయి విద్యార్థులను, యువతను బలి పశువులను చేసి తప్పుదోవ పట్టించి గంజాయి మత్తు పదార్థాలకు బానిసలు చేస్తున్నారని అన్నారు. అనంతరం చోడవరం లోని బాలికల వసతి గృహంలో భగత్ సింగ్ , రాజగురు, సుఖ దేవ్ ల వర్ధంతి సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి, డివైఎఫ్ఐ నాయకులు ఎస్ వి నాయుడు, దేవుళ్ళు, నాగిరెడ్డి సత్యనారాయణ, విద్యార్థిని విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పిడిఎస్ఓ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవుల 95వ వర్ధంతి వేడుకలు

**చోడవరం, మార్చి 23, ప్రభాతవార్త**



భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవుల 95 వ వర్ధంతిని సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట దినంగా పాటిద్దామని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ పిలుపునిచ్చింది. సోమవారం స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో కార్యక్రమంలో ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎన్.భాస్కర్ మాట్లాడుతూ భగత్ సింగ్, రాజు గురు, సుఖదేవులు రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తృణప్రాయంగా దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరులని కొనియాడారు. మరణించే ముందు "విప్లవం వర్ధిల్లాలి! "సామ్రాజ్యవాదం నశించాలి అంటూ నినదిస్తూ ఉరికంబమెక్కారనీ అన్నారు. అమెరికా, ఇజ్రాయిల్ కలిపి ఇరాన్ పై సాగిస్తున్న యుద్ధకాండను ప్రపంచ ప్రజలంతా ఖండించాలని అన్నారు.ఈ మధ్యనే వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మధురోను, వారి భార్యను అమెరికా అరెస్ట్ చేసిందని, ఇప్పుడు ఇరాన్తో యుద్ధం చేస్తుండగానే క్యోబాలో 60 శాతం భూభాగంలో విద్యుత్తు లేకుండా చేసిందన్నారు. తర్వాత యుద్ధం కూడా ప్రకటిస్తామని ట్రంప్ చెప్తున్నాడు అంటే ఇది అమెరికా కర్కసత్వానికి, యుద్ధ దాహానికి, దుర్మార్గమైన సామ్రాజ్యవాదానికి నిదర్శనమని అన్నారు.ఈ యుద్ధం కారణంగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ రేట్లు పెరుగుతున్నాయని వీటి కారణంగా రోజువారి నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే పరిస్థితి సంభవిస్తుందని, ఇప్పటికే అమెరికన్ డాలర్ తో పోలిస్తే రూపాయి విలువ 119 రూపాయలకు చేరుకుందని, ఇది భారత ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సంతోష్ ,అర్జున్, పీడీఎస్ఓ జిల్లా నాయకులు పి.రాజేష్,.మణికంత,మహేష్,నవీన్ విద్యార్థులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ 95వ వర్ధంతి ఘనంగా నిర్వహించినఐద్వా:: సిఐటియు

**(రాంబిల్లి మార్చి 23 ప్రభాతవార్త)**



రాంబిల్లి మండలంలో దేశ స్వతంత్ర సమరయోధుడు, విప్లవ వీరుడు భగత్ సింగ్ 95వ వర్ధంతి సందర్భంగా సిఐటియు (సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్) మరియు ఐద్వా (అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు, ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు, అనంతరం నాయకులు ఆయన త్యాగాలను స్మరించుకున్నారు, స్వతంత్రం కోసం తన ప్రాణాలను అర్పించిన భగత్ సింగ్ జీవితాన్ని, ఆయన ఆలోచనలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు, భగత్ సింగ్ కేవలం స్వతంత్ర సమరయోధుడే కాకుండా సమాజంలో సమానత్వం న్యాయం కోసం పోరాడిన మహానుభావుడు అని తెలిపారు, కార్మికుల హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గం ఇప్పటికి ప్రస్తుత కాలంలో ప్రసంగికమని పేర్కొన్నారు, ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు పి మాణిక్యం, మండల కార్యదర్శి చందక మంగతాయారు, సిఐటియు నాయకులు జిల్లా కార్యదర్శి జి దేవుడు నాయుడు,చందక రామకృష్ణ , రాము నారాయణరావు డివైఎఫ్ఐ నాయకులు శివాజీ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## నర్సీపట్నం డిగ్రీ కళాశాలలో భగత్ సింగ్ 95వ వర్ధంతి కార్యక్రమం

**నర్సీపట్నం,మార్చి 23,ప్రభాతవార్త**



నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భగత్ సింగ్ 95వ వర్ధంతిని సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఎస్ఐ కృష్ణమూర్తి మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం భగత్ సింగ్ చిరుప్రాయంలోనే ప్రాణాలు అర్పించారని కొనియాడారు. తండ్రి క్రమాభిక్ష కోరినా ఆయన తిరస్కరించి చిరునవ్వుతో ఉరితాడును స్వీకరించడం యువతకు ఆదర్శమన్నారు.భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు చదువులో రాణిస్తూ దేశభక్తితో ముందుకు సాగాలని సూచించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను గుర్తుంచుకుని సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ భగత్ సింగ్ వంటి మహనీయుల ఆలోచనలు నేటి సమాజానికి కూడా మార్గదర్శకాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్, విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నర్సీపట్నం గ్రేడ్1 సాధనకై కూటమి నేతల నిరసన

**: పెట్ల గణేష్ దొంగ వైఖరిపై లాలం మురళీకృష్ణ ఫైర్**

**నర్సీపట్నం,మార్చి 23,ప్రభాతవార్త**



పక్క నియోజకవర్గం నుండి వచ్చిన పెట్ల గణేష్‌కు నర్సీపట్నం అభివృద్ధి జరగడం ఇష్టం లేదు .నర్సీపట్నం అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్న వైఎస్సార్సీపీ నాయకులు, ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే పెట్ల గణేష్ దొంగ వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ తెలుగుదేశం పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి లాలం మురళీకృష్ణ తీవ్రంగా ధ్వజమెత్తారు. అంబేద్కర్ విగ్రహం వద్ద కూటమి నాయకులు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. మార్చి 17న జరిగిన ఆఖరి మున్సిపల్ సమావేశంలో 4వ అంశంగా నర్సీపట్నం మున్సిపాలిటీని గ్రేడ్1 గా అప్ గ్రేడ్ చేసే తీర్మానంపై చర్చ జరిగిందని, 28 మంది కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారని మురళీకృష్ణ ఈ సందర్భంగా గుర్తుచేశారు.అయితే భోజన విరామం అనంతరం మున్సిపల్ ఛైర్పర్సన్ సుబ్బలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే పెట్ల గణేష్ మాటలు విని తీర్మానం ఆమోదం పొందలేదని మినిట్స్ బుక్లో రాయడం నర్సీపట్నానికి చేసిన తీవ్ర అన్యాయమని ఆయన ధ్వజమెత్తారు.పక్క నియోజకవర్గానికి చెందిన పెట్ల గణేష్ ఇక్కడ జోక్యం చేసుకోవడం దారుణమన్నారు. గతంలో నూకాంబికా గుడి విషయంలో 10 లక్షలు తీసుకున్నారని, డమ్మీ ఎమ్మెల్యేగా వ్యవహరించారని తీవ్రస్థాయిలో విమర్శించారు. నర్సీపట్నం వార్షిక ఆదాయం ఆధారంగా గౌరవ అయ్యన్నపాత్రుడు గారు మున్సిపాలిటీని గ్రేడ్1 గా అప్ గ్రేడ్ చేయాలని దృఢ సంకల్పంతో ఉన్నారని, ఆ అభివృద్ధిని అడ్డుకుంటున్న వైసీపీకి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఈ నిరసనలో మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ సుబ్బలక్ష్మి స్వయంగా రాసి ఇచ్చిన తీర్మానం ప్రతులను చేతబూని నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ గుడ బండి ఆదిలక్ష్మి, వైస్ ఛైర్పర్సన్ గొలుసు నరసింహమూర్తి, దనిమిరెడ్డి మధు, నూకాంబికా ఆలయ ఛైర్మన్ కొరుప్రోలు శ్రీను, డబ్బీర్ శ్రీకాంత్, దాసు, పలువురు మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్చార్జిలు, దళిత నాయకులు పాల్గొన్నారు.

## నక్కపల్లి ముఖ్యమంత్రి చంద్రబాబు సభకు తరలి వెళ్లిన నాయకులు

**కసింకోట, మార్చి 23, ప్రభాతవార్త;**




నక్కపల్లి లో సోమవారం జరుగు స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సభకు కసింకోట మండలం నుండి కూటమి నాయకులు బస్సులలో బయలుదేరి వెళ్లారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కాయల మురళి, వేగి గోపి, జనసేన నాయకులు ఆధ్వర్యంలో నక్కపల్లి బయలుదేరి వెళ్లారు.

## దైవ కార్యానికి ఆటంకాలు వద్దు.. నర్సీపట్నంలో "సృష్టి క్షేత్ర" నిర్మాణాన్ని అడ్డుకోవాలని చూడటం దారుణం

**నర్సీపట్నం,మార్చి 23,ప్రభాతవార్త**



నర్సీపట్నం పెద్ద చెరువు వద్ద ఆధ్యాత్మిక కేంద్రంగా రూపుదిద్దుకుంటున్న "సృష్టి క్షేత్రం"లో 108 అడుగుల భారీ శివపార్వతుల విగ్రహ నిర్మాణాన్ని అడ్డుకోవాలని చూడటం దారుణమని స్థానిక అర్చకులు, పురోహితులు తీవ్రంగా ఖండించారు. గౌరవ అయ్యన్నపాత్రుడు గారి ఆధ్వర్యంలో, విజయ్ బాబు, రాజేష్ బాబుల సంకల్పంతో నర్శీపట్నంలో మునుపెన్నడూ లేని విధంగా 108 అడుగుల ఎత్తైన ఎదురెదురుగా ఉండే శివపార్వతుల విగ్రహాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.ఉత్తర వాహిని నదీ తీరాన దక్షిణ కాశీగా పిలువబడే ఈ ప్రాంతంలో నిర్మితమవుతున్న ఈ క్షేత్రం నర్శీపట్నానికే గర్వకారణమని అర్చకులు పేర్కొన్నారు. గతంలో హైదరాబాద్లో బుద్ధుడి విగ్రహం, కైలాసగిరిపై శివపార్వతుల విగ్రహం, గుజరాత్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వంటివి ఆయా ప్రాంతాలకు ఎంతటి పేరు ప్రఖ్యాతులు, ఉపాధి అవకాశాలు తీసుకువచ్చాయో, ఈ సృష్టి క్షేత్రం కూడా నర్శీపట్నానికి అంతే ఖ్యాతిని తీసుకువస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.ఇంతటి పవిత్రమైన బృహత్కార్యాన్ని అడ్డుకునేందుకు మాజీ ఎమ్మెల్యే పెట్ల గణేష్ తదితరులు వాట్సాప్, యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా దుష్ప్రచారం చేస్తూ అడ్డంకులు సృష్టించే ప్రయత్నం చేయడం పట్ల అర్చకులు అనిపిండి ఫణి కుమార్, పెరివిల్లి రామం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయ్యన్నపాత్రుడు ఎవరి వద్ద ఎటువంటి ఆర్థిక సహాయం ఆశించకుండా, ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా స్వచ్ఛందంగా ఈ విగ్రహ నిర్మాణాన్ని చేపడుతున్నారని స్పష్టం చేశారు. పరమశివుడికి సంబంధించిన మహాకార్యానికి ఆటంకాలు కల్పించడం ఏమాత్రం శ్రేయస్కరం కాదని, దైవ కార్యాలను అడ్డుకునే వారి కుటుంబాలు బాగుపడవని వారు హెచ్చరించారు. నర్శీపట్నం ప్రజలందరూ ఈ పవిత్ర కార్యక్రమానికి మద్దతుగా నిలవాలని, ఎటు వంటి ఆటంకాలు లేకుండా సృష్టి క్షేత్ర నిర్మాణం విజయవంతంగా పూర్తి కావాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రారంభోత్సవం రోజైనా వచ్చి ఒక్క పువ్వు వేసి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో పేరి ఆదిత్య, భమిడిపాటి జగదీశ్, వెలవలపల్లి బలరామ శర్మ పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి భాషోత్సవ పోటీల్లో భవ్య శ్రీ ప్రతిభకు ప్రథమ బహుమతి

**(రాంబిల్లి మార్చి 23 ప్రభాతవార్త)**



రాంబిల్లి మండలం పంచదార్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి భవ్య శ్రీ ప్రతిభకు ప్రథమ బహుమతి లభించింది, అనకాపల్లి జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి బాషోత్సవ పోటీలలో 9వ తరగతి చదువుతున్న ఎన్. భవ్యశ్రీ తెలుగు స్టోరీ టెల్లింగ్ అంశంలో ప్రథమ స్థానం గెలుపొందింది, ఈ పోటీలలో ఏడు మండలాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు, తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషలలో పద్య పఠనము మరియు కథలు చెప్పడం అను రెండు అంశాల్లో ఈ పోటీలు నిర్వహించగా ప్రథమ స్థానంలో భవ్య శ్రీ గెలుపొందిందని పంచదార్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ఉమా తెలిపారు, ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు వి. సూర్యనారాయణ, ఎం. సూర్యారావు మాట్లాడుతూ భవ్య శ్రీ విజయం పాఠశాలకే కాకుండా పంచదారల గ్రామానికి కూడా గర్వకారణం అని కొనియాడారు, విద్యార్థులు భాషా ప్రావీణ్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి పోటీలు ఎంతో ఉపయోగపడతాయని వారు అన్నారు, భవ్యశ్రీ లాంటి ప్రతిభావంతుల విద్యార్థులు భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

